అదే యిప్పటికీ, అంత బాధలోనూ, ధైర్యాన్నీ, విశ్వాసాన్నీ కలిగిస్తోంది. 'సుఖవ్యాధులు ప్రాణం తీయవు' - అన్న నమ్మకం.

సావిత్రి మంచం మీదకు వంగి అతడి మొహం లోకి చూస్తూ బాధగా, దీనంగా, ఏదో అనేందుకు పెదిమలు కదపగానే, "దిగులు పడొద్దు, నేను చావను. అది తప్ప మరేదైనా... ఏదైనా జరగొచ్చు" అన్నాడు.

ఆమె పొర్లివచ్చే దుఃఖాన్ని దిగమింగుతూ గాద్గదికంగా అన్నది -

"డాక్టరుగారు ప్రమాదం అంటున్నారు. వీలునామా...."

సావిత్రి మాట పూర్తి చేయకముందే నర్సు పెద్దగా చప్పుడు చేస్తూ వచ్చి ఆమె చేయి పట్టుకుని బయటకు తీసుకుపోయింది.

రామారావు భయంతో కంపించిపోతూ, "వీలునామా... ఎందుకు? ఎందుకు?" అంటూ బాధగా మూలిగాడు.

❀ ❀ ❀

రెండునెల్ల తరవాత భర్త సజీవంగా హాస్పిటల్ నుంచి బయట పడినా, సావిత్రికి మాత్రం తల నున్నగా చేయించక తప్పలేదు. తిరుపతి వెంకటేశ్వరుడి సన్నిధానంలో మంత్రఘోషల మధ్య, సన్నాయి మేళాల సందడిలో ప్రాణప్రదంగా కాపాడుకుంటూ వచ్చిన పట్టుకుచ్చు లాంటి జడనీ - మొత్తం జుట్టునీ - కళ్ళనీళ్ళని చాటుగా పమిటచెంగుతో వత్తుకుంటూ, అర్పించేసింది.

భర్త బతికి బయటపడ్డందుకు ఆమెకు పెద్ద సంతోషమూ కలగలేదు - విచారమూ కలగలేదు. భర్త శవం - తన జుట్టునీ, నొసటిమీది బొట్టునీ, వంటిమీది రంగు చీరనీ బలిగా కోరుతుందనేదే- అప్పట్లో ఆమె అంతగా భయపడడానికి కారణం అయిందని - యిప్పుడు తాపీగా ఆలోచిస్తుంటే ఆమెకు తోచింది.

రామారావు ప్రవర్తన ఆమెలో రోజురోజుకూ అసంతృప్తిని పెంచుతోంది.

"వయసులో తప్ప, రూపంలో నీకూ, వెంకాయమ్మకూ అట్టే తేడా లేదు" - అని రామా రావన్నప్పుడు ఆమె హృదయం భగ్గుమన్నది.

"అయితే, వెంకాయమ్మనే తెచ్చుకోండి!"

ఎంత కటువుగా, ఎంత నిర్లక్ష్యంగా జవాబు చెప్పేందుకు వీలుందో అంత కటువుగా నిర్లక్ష్యంగా భర్త మొఖాన అనేసి, సావిత్రి నిర్భయంగా రామారావు ఎదట నిలబడింది.

అతడు యిదివరకు మాదిరిగా, గట్టిగా కోప్పడనూలేదు - బూతులూ తిట్టలేదు. చీటికీమాటికీ చెయ్యి చేసుకునే అలవాటున్న రామారావు హతాశుడిలా, తల వంచుకుని వుండిపోయాడు.

రోజులు గడిచినకొద్దీ, సావిత్రికి భర్త వాలకం వింతగా కనబడసాగింది. ఎప్పుడూ ఏదో ఆలో చిస్తూ, కిటికీ దగ్గిర కుర్చీలో కూర్చుని రోడ్డువైపు తదేక దృష్టితో చూస్తూవుండే అతడి ధోరణి ఆమెకేమీ అర్థం కాలేదు.

సుందరి దగ్గిర నుంచి ఒకటి రెండుసార్లు కబురు వచ్చినా వెళ్ళలేదు. ముఖ్యంగా యీ విష యం సావిత్రికి చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. తన భర్త ఆ పాడు మార్గాన్నుంచి బయటపడ్డాడా? ఆమెకు సంశయం, అనుమానం కూడా కలిగింది.

రామారావు, యిల్లూ వళ్ళూ కూడా గుల్లయ్యే ఆ వృత్తి నుంచి బయటపడ్డందుకు సావిత్రికి కొంత సంతోషం కలిగినా, అంతకన్న భయం కూడా కలిగింది.

'పొద్దస్త మానమూ యిదే విధంగా యిల్లు వదలకుండా కూర్చుంటే - తను కామేశాన్ని కలుసుకోవడం ఎలా?'

ఈ సమస్యకు పరిష్కారం దొరక్క ఆమె చాలా వ్యాకులపడింది. దాదాపు సంవత్సరం నుంచీ, భర్త ప్రతిరాత్రీ-పగలూ ఎక్కువ భాగం సుందరి దగ్గర గడుపుతూంటే, తను రాత్రంతా కామేశంతో గడిపేది! యీనాటి వరకూ రెండో జీవికి ఆ సంగతి తెలీదు. ఎప్పటికైనా దొంగతనం దాగినా, యిది మాత్రం దాగదనే అనుమానం లేకపోలేదు.

ఏ పదిహేను రోజులకో, యిరవై రోజులకో ఒకమారు 'తను' అనే జీవి వున్నట్టు గుర్తుకొచ్చిన వాడల్లే భర్త ఓమారు ప్రేమగా దగ్గరకు తీస్తే ఆమెకు పరవశత్వం కలిగేది. హృదయంలోని భారం యిట్టే దిగిపోయినట్టయేది. ఒకవేళ భర్త ఏ కారణం వల్లనైనా యిరవై అయిదు రోజులు తనను చూడనట్టు తిరిగితే, దగ్గరకు తీసుకోపోతే, మిగతా అయిదు రోజుల్లో శతపోరి తన యవ్వనాన్నీ, అందాన్నీ - భార్యగా తనకున్న అధికారాన్నీ, చనువునీ అన్నిటినీ ఉపయోగించి ఒక్క మారైనా అతడి కౌగిల్లో నలిగిపోయేది. అంతే! మళ్ళీ నెల తిరిగి ఆ రోజులు తిరిగి వచ్చేవరకు కామేశంతోటే ఆమె సర్వసుఖాలూ, ఆనందమూ. ముప్పై రోజుల్లో ఏ ఒకటి రెండు మార్లో భర్త చూపే ఆదరణకు, తక్కిన అన్ని రోజుల్లో కామేశం చూపే ప్రేమా, కామం, వాంఛా; వాటి అన్నిటి పాపఫలాల్నీ - ఒకవేళ సంభవించడమే అంటూ జరిగితే - మోసే శక్తీ, అతని వంశం పేరు, ఆస్తి, సెక్యూరిటీగా నిలబడతవని ఆమెకు నమ్మకం.

సావిత్రి భర్త ఎప్పుడూ యిల్లు కదలకుండా వుండడం వల్ల కామేశం మీద కలిగే విరహం రోజురోజుకూ పెరిగి ఆ భారం దినదినం అధికమై కుంగిపోతుంటే, పట్టణం పట్టణమే, అతడికి హాస్పిటల్లో శరీరంలో ఏ భాగానికి ఆపరేషన్ చేశారో, సుందరి దగ్గిరకు ఎందుకని వెళ్ళడం లేదో, అన్న సమస్యలకి పలురకాల కారణాలు చెప్పుకుని, ఎంతకీ తృప్తి, పరిష్కారం లేక కృశించి పోతోంది.

పరిస్థితులు యిలా వున్నప్పుడు, సావిత్రి తెగించి ఓ రాత్రి కామేశాన్ని రమ్మని కబురుజేసింది.

రామారావు పగలల్లా కిటికీలో గుండా రోడ్డున వచ్చిపోయే జనాన్ని చూసి అలసిపోయి, మామూలు ప్రకారం గురక కొట్టుతూ నిదరపోయాడు. సావిత్రి శబ్దం కాకుండా దొడ్డి తలుపు తీసి గుడ్డి వెన్నెల్లో గుమ్మటంలా వున్న బాదం చెట్టు కింద నిలబడింది.

కాసేపటికల్లా, కామేశం గోడ దూకి దొడ్లో ప్రవేశించాడు. ఆమెలో నెల రోజుల నుంచి పెరు గుతూ వచ్చిన విరహం, తియ్యని బాధా ఒక్కసారిగా బయట పడింది - వేగంగా కొట్టుకుంటున్న

గుండెతో పాటు, అంత వేగంగానూ కదలలేక ఆమె కాళ్ళు తడబడినై.

కామేశం ఏ ఆత్రుతా లేకుండా, నిబ్బరంగా ఆమె దగ్గిరకు వచ్చి, తడబాటుతో, వుద్రేకంతో ముచ్చెమట్లు పోసి, ఆనంద బాష్పాలు రాలుస్తున్న సావిత్రి పెదాల మీద, దొడ్డి తలుపు గొళ్ళెం గడగడ లాడేంత గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

సావిత్రి ఎన్నో మాట్లాడాలనుకుంది - ఎంతో చెప్పాలనుకుంది. కాని, ఆమె నోటి నుంచి 'అబ్బా! ఎన్నాళ్ళకు' - అన్న ధ్వని మాత్రం బయట పడింది. అయినా చేతులు మాత్రం అతడి సర్వాన్నీ తడిమి చూసి చిరపరిచితమైన తులసికోట పక్కకు లాగినై.

"ముందు చాలా మాట్లాడాలి!" - కామేశం, ఆమె బుజాల్ని గట్టిగా పట్టుకుని, ఆ గుడ్డి వెన్నెల్లో అస్పష్టంగా మెరుస్తున్న ఆమె కళ్ళలోకి చూశాడు.

"ఏముంది మాట్టేడేందుకు? మాట్లాడ్డానికే వచ్చావా?"

"కాదనుకో! అయినా నీ మంచికే... క్షేమానికే..."

"అదేదో తొందరగా తేల్చు" - సావిత్రి నిలువెల్లా ఆతృతా, వుద్వేగంగా మారి అన్నది.

"వూళ్ళో అన్నీ పుకార్లుగా వున్నాయ్" - కామేశం మెల్లిగా అన్నాడు.

"మన్ని గురించా?"

"మన సంగతేమీ కాదు. మన యిద్దరికీ తప్ప, యిది ఎవరికీ తెలీదు. మీ ఆయన..."

"మా ఆయన... ఏమిటీ?"

ఓ క్షణకాలం ఆమె కళ్ళల్లోకి చూసి కామేశం వూరుకున్నాడు.

సావిత్రిలో ఏదో అనుమానం యిట్టే కదిలింది.

"అదేదో దాచక త్వరగా చెప్పు. ఊఁ! త్వరగా!"

"మీ ఆయనకు చేసిన ఆపరేషనేమిటో నీకు తెలుసా?"

"ఏదో చిలిపి రోగానికి, చిలిపి ఆపరేషను"

"కాదు!"

"మరి!" సావిత్రి వుద్రేకంగా అతడి నడుం పట్టుకుని కదిలించింది - "అదేదో త్వరగా చెప్పు. యీ లోపల ఆయన నిదర లేవచ్చు"

"వూళ్ళో చాలామంది అనుకునేదే నిజమయితే - మీ ఆయన మేలుకుని యిక్కడికి వచ్చినా ఏమీ ఫరవాలేదు"

కామేశం అడుగులో అడుగు పెట్టుకుంటూ తులసికోట దగ్గిరకు వెళ్ళి, దాన్ని బాగా ఆనుకుని కూర్చుని సిగరెట్టు వెలిగించేందుకు అగ్గిపెట్టె జేబులో నుంచి గలగలమనిపిస్తూ బయటకు తీశాడు.

కామేశం తన భర్తను గురించి అన్న మాటలతో నిర్విణ్ణురాలై ఉన్నచోటనే కదలక, స్థాణువులా అయిపోయిన సావిత్రి, నిప్పుపెట్టె గలగలతో వులిక్కిపడి గబగబా అతడి దగ్గిరకు పరుగెత్తి -

"వద్దు! అగ్గిపుల్ల గీయకు. ఎవరైనా చూస్తారు. ఆయనే చూడొచ్చు" అంటూ కామేశం చేయి పట్టుకున్నది.

కామేశం ఆమెను ఆప్యాయంగా దగ్గరకులాక్కుని -

"మీ ఆయనతో నీ కాపురం ఎప్పుడో ముగిసిపోయింది. యిక నేనే..... నేనే!" అన్నాడు.

"నాకు చాలా భయంగా వుంది. అసలు సంగతేదో చెప్పవూ?"

సావిత్రి బతిమాలుతూ అతడి గడ్డం పట్టుకుని, ఓ మారు కళ్ళల్లోకి చూసి, నాజూగ్గా ముద్దు పెట్టుకుంది.

"మీ ఆయనకు పెద్ద ఆపరేషన్ జరిగింది. అది ఎంత పెద్ద ఆపరేషనంటే - ఆయన యిప్పుడు పురుషుడు కాదు"

"వట్టిది!" - సావిత్రి గుండీలు వూడిన అతడి చొక్కాలోకి చేతుల్ని పోనిస్తూ కిలకిలా నవ్వుతూ అన్నది.

"నిజం!" - కామేశం, ఆమె చెంపల్ని తన అరచేతుల్లో గట్టిగా పట్టుకుని, తలను తన ముఖం వైపుకు ఎత్తుతూ అన్నాడు.

"నేను నమ్మను"

"హాస్పిటల్ వాళ్ళను అడిగావా?" - కామేశం సూటిగా ప్రశ్నించాడు.

"అడిగాను. వాళ్ళు ప్రమాదమైన ఆపరేషనేగాని, ఏదో చిలిపి రోగానికి అని చెప్పారు"

"అదే యిది! యిప్పుడు రామారావు మీ ఆయన కాదు. మీ ఆవిడ!" - కామేశం ఆమె చెంపల్ని తన మునివేళ్ళతో సున్నితంగా తాకుతూ నవ్వాడు.

"నిజమా?" - కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరుగుతూండగా సావిత్రి భయంగా అడిగింది.

"నిజం!"

"వొట్టు పెట్టు!"

కామేశం ఆమె చేతులో చెయ్యి వేసి, ఆమెను దగ్గరకు లాక్కునేందుకు చేతులు చాచాడు.

"మనిద్దరికీ యివ్వాళతో ప్రేమబంధం తెగిపోయింది" - వెక్కివెక్కి ఏడుస్తూ సావిత్రి ఎడంగా వెళ్ళి చతికిలబడింది.

"ఎందుకని? ఊఁ! చెప్పు ఎందుకని" - ఆమె పక్కగా కూర్చుంటూ కామేశం అడిగాడు.

"యిక అది...అది... జరిగేందుకు వీల్లేదు"

"అవును... అది! ఆఁ! అది... ఎందుకని వీల్లేదు?" - తడబడుతూ అతడు అడిగాడు.

"యిదివరకు ఆ కారణంగా ఏదైనా జరిగితే... ఆయన సంతానంగా చెల్లిపోయేది. మరి యిప్పుడు" - సావిత్రి ఏడవటం ప్రారంభించింది.

"వొద్దు! ఏడవవొద్దు! నేనున్నా.... నేను" - కామేశం బతిమాలాడు.

"వుండి ఏం చేస్తావ్?"

"అన్నిటికీ బాధ్యత వహిస్తా. నీ మీద వొట్టు! దేవుడి మీద వొట్టు! యిదిగో ఈ తులసి చెట్టు సాక్షిగా వొట్టు!"

కామేశం వుద్రేకంగా ఆమె చేతిలో చెయ్యి వేసి, ఆమె చేతిని మృదువుగా పైకెత్తి ముద్దు

పెట్టుకున్నాడు.

"నువ్వు ఎన్నయినా చెప్పు కామేశం, నాకేదో భయంగానే వుంది. యింతకాలం ఏదో గుట్టుగా జరిగిపోయింది. అసలు నేను చేసేది వ్యభిచారం అని నా మనస్సే అంగీకరించదు. యిక రేపటి నుంచి లోకం నా గురించి ఆ విధంగా అనుకుంటే నేను సహించలేను. నెల తప్పిందంటే ఆయనే స్వయంగా బయటపడి, పదిమందిలో నా బతుకు బయట పెడతాడు"

సావిత్రి సన్నగా ఏడవడం ప్రారంభించింది.

కామేశం తులసి కోటకు చేరగిలా పడి దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

ఓ ఐదు నిమిషాలు గడిచిపోయినై.

వెన్నెల క్రమక్రమంగా తగ్గిపోతోంది. బాదంచెట్టు కొద్ది కొద్దిగా చీకట్లోకి జారపడుతోంది. తులసికోట కొంచెం కొంచెంగా తన వునికిని పరిసరాల్తో లీనం చేస్తోంది.

సావిత్రి మాట్టాడకుండా అక్కడి నించి లేచి తలుపు వైపుకు రెండడుగులు వేసింది.

అప్పటి వరకూ తను ముందుగా విషయమంతా చెప్పేసిందుకు తన్ను తాను తిట్టుకుంటూ మార్గాంతరాల కోసం వెతుకుతున్న కామేశం సావిత్రి వైపుకు హఠాత్తుగా చూసి ఎగిరి నిలబడి రెండు అంగల్లో ఆమె దారి కడ్డంగా వెళ్ళి నిలబడ్డాడు.

"నన్ను యిలా వదిలిపోతావా?" – అతడి గొంతు జాలిగా ఏడ్చింది.

"మరేం చేయను?"

"యివ్వాళకి ఏదో ఒక్క... రేపు రాను. మళ్ళీ వచ్చేప్పటికి ఆ ప్రమాదం రాకుండా సరైన పద్ధతుల్తో వస్తాను"

రసభంగాన్ని సహించనంటున్న హృదయం, నరాలూ, ఆమె శరీరాన్ని కట్టకట్టి అతడి చేతుల్లో పెట్టినై.

కామేశం వెళ్ళిన తరవాత యిక ఆ రాత్రికి సావిత్రి కన్ను మూయలేదు. వూరంతా గుప్పుమన్నా ఆ సంగతి తన వరకూ ఎందుకు రాలేదు? బహుశా తను ఆ దురదృష్టవంతుడి భార్య కావడమే అందుకు కారణం కావచ్చు. అసలు కామేశం చెప్పింది నిజమేనా?

యీ ప్రశ్నా, సంశయం ఆమెను మళ్లా వెంటాడినై. ఆమె అన్ని విధాలా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. వారం రోజుల్లో నేనే ఆయన పురుషుడో కాదో తేల్చేస్తాను.

సావిత్రి యీ నిర్ణయానికి వొచ్చి తేలికైన హృదయంతో దొడ్లో తులసి మొక్కకు నీళ్లు పోసేందుకు బొక్కెన తీసుకుంటూ వుండగా యింట్లో గట్టిగా కేకలు పెడుతున్న ధ్వని వినబడింది.

ఆమె బొక్కెన అక్కడే పడేసి, త్వరత్వరగా యింట్లోకి వచ్చింది.

రామారావు పెద్ద కేకలేస్తూ, గదిలో కుర్చీలనీ, గాజుగ్లాసుల్నీ, నిలువుటద్దాన్నీ బద్దలు కొట్టి – యింకా బద్దలు కొట్టేందుకు ఏమైనా వున్నవేమో అని అటూ యిటూ చూస్తూ అరుస్తున్నాడు.

"పాడులోకం ఛీ! ఛండాలపు మనుషులు! నేను మగవాణ్నే కాదా? రుజువు చేస్తాను. నోళ్ళు మూయిస్తాను. కిటికీ దగ్గిరకు వచ్చి అనేంత ధైర్యమా, యీ వెధవలకి?"

ఆవేశంతో కిటికీ రెక్కలు యిసురుగా మూసి, రామారావు అక్కడే - పక్కగా వున్న కుర్చీలో కూలబడ్డాడు. అలసి పోయి రొప్పుతూ అతడు గొణగడం సాగించాడు.

"రుజువు చేస్తా! ఆ సుందరి చేతే! సుందరి! సుందరి!"

సావిత్రి, భర్త వంక చూస్తూ కాసేపు నిలబడి, ఏమీ అనకుండా వెళ్ళిపోయింది. ఆమెకు పరిస్థితంతా అయోమయంగా కనబడింది.

ఆ సాయంకాలం రామారావు, వూరుకు వూరే చూస్తుండగా సిగరెట్ టిన్ను చేత్తో పట్టుకుని, సెంటు వాసన ఘుమఘుమలు వీధంతా కలయ తిరుగుతుండగా నిబ్బరంగా నడిచి - అందరి కళ్ళ ఎదుటా సుందరి యింటి తలుపు తోసుకుని లోపల ప్రవేశించాడు.

దీంతో తిరిగి వూరంతా హోరెత్తిపోయింది. ఏ యిద్దరు ముగ్గురో తప్ప - అందరూ యింగువ వున్న గుడ్డే అని అంగీకరించారు. ఆ యిద్దరు ముగ్గురూ, యింగువ కట్టిన గుడ్డ మాత్రమే అని ఎంత నెత్తీ నోరూ కొట్టుకున్నా వినే వాళ్ళూ, విని నమ్మేవాళ్లూ అంతగా కనబడలేదు.

సావిత్రి మాత్రం, పూర్వపులాగానే కామేశానికి, బాహాటంగా రాత్రిళ్ళు అన్ని తలుపులూ తెరిచేసింది. కాని పాత ధోరణిలో ఆమె ఆ నెలలో ఓ మారుకు మాత్రం, భర్త కౌగిలి కోసం ఎంత ప్రయత్నించినా, తన యౌవనాన్నీ, అందాన్నీ, చనువునీ, భార్యగా తన అధికారాన్నీ ఎంతగా వుపయోగించి గింజుకున్నా, రామారావు మరీమరీ దూరమై ఓ నిండు ఐదు దినాలు యింటికి రావడమే మానేశాడు.

సావిత్రి, నిండా మునిగిన తరవాత చలికి భయపడడం ప్రయోజన శూన్యం అని భావించింది. అసలు, రెండు మంచెలు కట్టే తత్వం ఆమెది కాదు!

రోజులూ, వారాలూ, నెలలూ మామూలు వేగంలోనే కదిలినై.

కామేశం అనేక రకాల వార్తలు మోసుకొచ్చేవాడు.

సుందరి పూర్వ ప్రియుడు నారాయణ కూడా రాత్రుల్లో ఆమె యింటికి వెళ్తున్నాడనీ, చూసిన వాళ్ళు కూడా వున్నారనీ అందులో ఒకటి.

సావిత్రి యిలాంటి వార్తలకి విలువలు కట్టడం మానేసింది. మొదటి రెండు నెలల్లోనూ, కనీసం ఒక్కసారైనా భర్త పొందుకోసం అన్నిరకాల ప్రయత్నాలూ చేసింది. కాని అవి విఫలమైనప్పుడు - తొమ్మిదిలో నుంచి ఒకో నెలను తీసేసి, ఆ మిగిలిన సంఖ్యను గుర్తుపెట్టుకోసాగింది.

ఎనిమిదో నెల నిండగానే, యిక ఆమె రోజులు లెక్కించ సాగింది. రామారావు పురుషుడే కాదని లోగడ ప్రచారం చేసిన వాళ్ళల్లా, యిప్పుడు అతణ్ని పురుష సింహుడుగా గుర్తిస్తున్నారు. కాని, రామారావు మాత్రం భార్యకు ఏదో బల్ల పెరుగుతోందనీ, కొద్ది రోజుల్లో మరణం తప్పదనీ లోలో సంతోషిస్తున్నాడు. సావిత్రి చనిపోయిన తరువాత తను హాయిగా సుందరి దగ్గరో లేక యింటి పట్టునో బతకొచ్చు. అదీ అతడి ఆశ.

ఓరోజు మధ్యాహ్నం అన్నం వడ్డిస్తూ, "నన్ను హాస్పిటల్లో చేర్చండి, ఏదో భయంగా వుంది" అని సావిత్రి అడిగినప్పుడు రామారావు హృదయం ఆనందంతో వెల్లివిరిసింది. ఆమె అంతం

అతడికి కనుచూపు దూరంలో కనిపించింది. బల్ల యింత ముదిరిన తరువాత ఏ డాక్టరూ నయం చేయలేడని అతడనుకున్నాడు. అతడి కేనాడూ అది గర్భమేమో అన్న అనుమానం కలగలేదు. తను ఎంత గడ్డు వ్యభిచారో తన భార్య అంత గడ్డు పతివ్రత అని అతడి నమ్మకం.

సావిత్రిని హాస్పిటలులో చేర్చిన ఐదో రోజున రామారావుకు వెంటనే రమ్మని అక్కడి నుంచి కబురు వచ్చింది. పర్సు బయటకు తీసి మరణవార్తేమో అని బాగా సత్కరిద్దామని ఆ కబురు తెచ్చిన వాణ్ణి ఎంత అడిగినా వాడు తనకు తెలీదు అని జవాబిచ్చాడు. పర్సు తిరిగి జేబులో పెట్టి అతడు వెంటనే హాస్పిటల్‌కు బయలుదేరాడు.

గేటు దాటి హాస్పిటల్ మెట్లు ఎక్కుతుండగానే డాక్టరు నవ్వు ముఖం రామారావుకు కనపడింది.

అతడు ఆశ్చర్యపోయాడు.

"ఏం ప్రమాదం లేదు. సుఖప్రసవం అవుతుంది!" – డాక్టరు నవ్వుతూ అభినందిస్తున్నట్టు అన్న మాటలు రామారావుకు సూదుల్లా గుచ్చుకున్నయ్.

అతడు నివ్వెరపోయి తడబడుతూ, "ఏమిటి డాక్టరుగారూ! ఆమె నా భార్య! గర్భం రావడం ఎలా సాధ్యం? మీరేగా నాకు ఆపరేషన్ చేసింది? నేను సంసారానికి పనికిరానని కూడా మీకు తెలుసు" – అన్నాడు.

డాక్టరు పెదిమ కొరుక్కుని, ఓ క్షణం తల వంచి, నిదానంగా తల ఎత్తి అతడి ముఖంలోకి నిశితంగా చూస్తూ, "స్త్రీకి తాళి కట్టిన వాడివల్ల మాత్రమే గర్భం అవుతుందని ఎక్కడా లేదు. ఆరోగ్యంగల ఏ పురుషుడైనా అందుకు పనికి వస్తాడు" అన్నాడు.

రామారావు కళ్ళు చీకట్లను కప్పుకున్నయ్, తల తిరిగింది. బలవంతంగా, శక్తినంతా కూడ తీసుకుని అన్నాడు.

"సావిత్రి అలాంటిది కాదు. బహుశా మీరు పొరబడ్డారు. అదేదో బల్ల!"

అతడు మాట పూర్తి చేయకముందే, నర్సు కిలకిల నవ్వుతూ ఆ గదిలో ప్రవేశించింది.

"రామారావుగారు అదృష్టవంతులు! కవల పిల్లలు! రామలక్ష్మణులు!" – నర్సు వుత్సాహంగా నవ్వి, మెల్లిగా చప్పట్లు కొట్టింది.

రామారావు వళ్ళు తెలీని వుద్రేకంతో, కుర్చీలో నుంచి లేవబోయి అంతలోనే నీరసంగా కింద పడిపొయ్యాడు. అతడి గొంతు మాత్రం మైక్‌లాంటి పెద్ద ధ్వనితో అరవసాగింది.

"యిప్పుడు రామలక్ష్మణులు, యీసారి పంచపాండవులు, ఆపైన నూరుమంది కౌరవులు – అయ్యో! యిందు క్కారణం నేను కాదు డాక్టర్! మీరు... మీకు తెలుసు!"

డాక్టర్ జాలిగా అతడి వంక చూస్తూ, చేతులు పట్టుకుని కూర్చోపెడుతూ అన్నాడు –

"ఇది మన యిద్దరికే కాక లోకానిక్కూడా తెలిసి వున్నట్టయితే యిప్పుడు నీకీ ప్రమాదం కలిగేది కాదు!"

❋

*(రేరాణి మాసపత్రిక : ఏప్రిల్, 1950)*